
# పోతనభాగవతంలో రసగుళికలు

## – ఆర్.శర్మ దంతుర్తి



# 17 వ భాగం

### *హిరణ్యకశిపుడు – 2*

శ్రీహరి మీద యుద్ధానికి అన్ని ప్రణాలికలూ సిద్ధం చేసుకున్నాడు కదా? ఇప్పుడు ముందు తపస్సు చేయాలి. దానికంటే ముందు తమ్ముడు పోయిన దుఃఖంలో ఉన్న తన తల్లిని ఓదార్చాలి. తర్వాత కోపం అంతా విష్ణువుమీద చూపించ వచ్చు. ఇలా అనుకుని హిరణ్యకశిపుడు తల్లి ఐన దితి దగ్గిరకి బయల్దేరేడు.

వ. అంత హిరణ్యకశిపుండు దుఃఖితుండై, మృతుం డయిన సోదరునకు నుదక ప్రదానాదికార్యంబు లాచరించి, యతని బిడ్డల శకుని శంబర కాలనాభ మదోత్కచప్రముఖుల నూఱడించి, వారల తల్లితోఁ గూడ హిరణ్యాక్షుని భార్యల నందఱ రావించి, తమ తల్లియైన దితి నవలోకించి యిట్లనియె. [7-37]

**శా. నీరాగారనివిష్టపాంథులక్రియన్ నిక్కంబు సంసారసం**

**చారుల్ వత్తురు గూడి విత్తురు సదా; సంగంబు లే దొక్కచోఁ;**

**శూరుల్ పోయెడి త్రోవఁ బోయెను భవత్పూనుండు దల్లీ! మహా**

**శూరుం డాతఁడు తద్వియోగమునకున్ శోకింప నీ కేటికిన్.** [7-38]

ఇప్పుడు వీళ్ళందరికీ వేదాంతం చెప్తున్నాడు చూడండి. "చలివేంద్రం దగ్గిరకి నీళ్ళకోసం వెళ్తాం, పోతాం బాటసారుల్లాగా ఈ సంసారంలో. ఇందులో శాశ్వతం అనేదేమీ లేదు. అదీగాక మనవాడు శూరుడిలాగా వాళ్ళ తోవనే పోయేడు. అందుచేత శోకించడం ఎందుకు? యముడికి నావాడు, పైవాడు అనే పక్షపాతం లేదు. కాలం కల్సిరాని నాడు ఎక్కడున్నా ప్రాణం పోతుంది."

**ఆ. ధనము వీథిఁ బడిన దైవవశంబున**

**నుండు; పోవు మూల నున్న నైన;**

**నడవి రక్ష లేని యబలుండు వర్ధిల్లు;**

**రక్షితుండు మందిరమునఁ జచ్చు.** [7-49]

దైవం అనుకూలిస్తే వీధిలో పోగుట్టుకున్న డబ్బులు కూడా దొరుకుతాయి. అడవిలో ఉండే ఏమీ చేతకానివాడు కూడా హాయిగా ఉంటాడు. లేకపోతే ఇంట్లో పెట్టుకున్న డబ్బులూ పోతాయి, చుట్టూ ఎంతటి రక్ష ఉన్నవాళ్ళైనా సరే చచ్చిపోతారు.

**క. అజరామరభావంబును**

**త్రిజగద్రాజ్యంబు నప్రతిద్వంద్వము దో**

**ర్విజితాఖిలశాత్రవమును**

**గజరిపుబలమును హిరణ్యకశిపుఁడు గోరెన్.** [౭-౭౧]

వ. ఇట్లు గోరి మందరాచల ద్రోణికిం జని; యందుఁ గాలి పెనువ్రేల నేలనిలువంబడి, యూర్ధ్వబాహుండయి మిన్ను చూచుచు, వాఁడి మయూఖంబులతోడి ప్రళయకాల భానుండునుం బోలె దీర్ఘజటారుణ ప్రభాజాలంబులతోడ నెవ్వరికిం దేఱిచూడరాక పరమదారుణంబైన తపంబు జేయుచుండె; నిర్జరులు నిజస్థానంబుల నుండిరి; అంత. [7-72]

ఇలా ఇంట్లో అందర్నీ ఊరడించి తపస్సుకి బయల్దేరేడు. తల్లికి ఎంత వేదాంతం చెప్పినా హిరణ్యకశిపుడి పట్టుదలలో ఏ మాత్రం తేడాలేదు. అంటే తన మనస్సులో ఉండే క్రోధాన్నీ మద మాత్సర్యాలనీ ఇంకా జయించలేదు మనలాగే. "విశ్వామిత్రుడు అసలు తపస్సు ఎందుకు మొదలుపెట్టేడు? వశిష్టుడిచేత బ్రహ్మర్షి అని పిలిపించుకోవడానికేగా? దానికోసం వశిష్టుడి నూరుగురు కొడుకులనూ చంపుతాడు. అందుచేత విశ్వామిత్రుడి తపస్సు కూడా రాక్షసుల తపస్సును పోలినదే" అని ఎక్కిరాల భరద్వాజ గారంటారు. ఏదీ అక్కర్లేదు అనుకుని చేసే తపస్సు వల్ల గానీ బ్రహ్మ జ్ఞానం లభించదు.

ఇప్పుడు హిరణ్యకశిపుడి తపస్సు ఎలా ఉందంటే – "పెనువ్రేల నేలనిలువంబడి, యూర్ధ్వబాహుండయి మిన్ను చూచుచు, వాఁడి మయూఖంబులతోడి ప్రళయకాల భానుండునుం బోలె దీర్ఘజటారుణ ప్రభాజాలంబులతోడ నెవ్వరికిం దేఱిచూడరాక పరమదారుణంబైన తపంబు." కాలి వేళ్ళమీద మాత్రం నిలబడి దారుణమైన తపస్సు మొదలుపెట్టేడు. ఇప్పుడు ఇంకో ప్రశ్న. ఎవరు మాత్రం కాలివేళ్ళమీద అలా రోజుల్లా నించోగలరూ అని. ఎందుకు నుంచోలేరు? అభ్యాసం చేస్తే ఏదైనా చెయొచ్చు అని మనకి తెల్సిందే. అదీగాక మన ముత్తాతలకి ఉండే దేహ దారుఢ్యం అందరూ ఎరిగిందే. యుగాలు గడిచే కొద్దీ దేహ ధారుఢ్యం తగ్గుతుందనీ అందుకే కలియుగంలో పూర్వం చేసినట్టుగా వెయ్యేసి ఏళ్ళు తపస్సు చేయక్కర్లేదనీ చెప్తారు. అయితే చేసే తపస్సులో మనసు ఎక్కడ ఉందీ అనేది ముఖ్యం.

**మ. అదిరెం గుంభిని, సాద్రియై కలఁగె నే డంభోనిధుల్, తారకల్**

**చెదరెన్ సగ్రహసంఘులై, దిశలు విచ్ఛిన్నాంతలై మండెఁ, బె**

**ల్లదరెన్ గుండెలు జంతుసంహతికి, నుగ్రాచార దైత్యేంద్రమూ**

**ర్ధదిశోద్ధూతసధూమ హేతిపటలోదంచత్తపోవహ్నిచేన్.** [౭-౭౩]

ఇలా హిరణ్యకశిపుడు చేసే తపస్సుకి, భూమి అదిరింది నక్షత్రాలన్నీ చెదిరిపోయేయిట. ఎక్కడికక్కడ జీవితం స్థంభించింది. ఈ తపస్సు విష్ణువు గురించే ఎందుకు చేయలేదు? దీన్నే కర్మ అని చెప్పుకున్నాం. మన కర్మ ఎలా, ఎటువేపు తోస్తే మనం అలా నడుస్తూ ఉంటాం. తల్లికి వేదాంతం చెప్పి అందులో విష్ణువుమూలానే ఇదంతా అని తెల్సీ, బ్రహ్మదేవుడికోసం ఎందుకు తపస్సు చేసేడు? తనని పుట్టించిన బ్రహ్మే అన్నింటికీ కారణభూతుడనే ఆలోచనతోనే.

సత్వ రజస్తమోగుణాలతో భగవంతుడు బ్రహ్మ విష్ణు మహేశ్వరులిగా దర్శనమిస్తూ ఉంటాడని చెప్పుకున్నాం. అందుకే భగవద్గీతలో "ఆదిత్యానామహం విష్ణుం, రుద్రాణాం శంకరశ్చాస్మి" అన్నాడు కృష్ణుడు. అయితే మనలో ఉండే ఈ త్రిగుణాలవల్ల మనకే దేముడి ఆకృతి

నచ్చుతుందో దాన్నే మనసులో ఉంచుకుంటాము కదా? అందుకే బ్రహ్మకోసం తపస్సు. ఇప్పుడీ తపస్సు వల్ల దేవతలు అంభోజాసనుడి దగ్గిరకెళ్ళి మొర పెట్టుకుంటున్నారు.

**క. దితికొడుకు తపము వేఁడిమి**

**నతితప్తుల మైతి మింక నలజడి నమరా**

**వతి నుండ వెఱతు; మెయ్యది**

**గతి మాకును? దేవదేవ! కారుణ్యనిధీ! [౭-౭౫]**

**శా. శంకాలేశము లేదు దేవ! త్రిజగత్సంహారమున్ దేవతా**

**సంకోచంబును వేదశాస్త్రపదవీసంక్షేపమున్ లేక యే**

**వంకన్ లేవ నటంచు దుస్సహతపోవ్యావృత్తి చిత్తంబులో**

**సంకల్పించె నిశాచరుండు ప్రతిసంస్కారంబు చింతింపవే. [౭-౭౬]**

దితి కొడుకు తపస్సు మొదలుపెట్టేడు. దాని వేడికి మేము అమరావతిలో ఉండలేకపోతున్నాం. వీడి మనసులో ఏ కోరిక ఉందో మనకి తెలియదు. వేదాల్ని పాడు చేయడానికా, మూడు లోకాల్నీ నాశనం చేయడానికా? అందుచేత మీరు వెళ్ళి వాడి సంగతి చూడాలి అన్నారు.

సరేనని బ్రహ్మ బయల్దేరేడు. ఆయనొచ్చేసరికి ఇక్కడున్నది పురుగులు, చీమలూ తినేసిన హిరణ్యకశిపుడి దేహమూ, అది నిలబడడానికున్న ఎముకలూను. వీడు తపస్సు చేస్తున్నాడని తెల్సు కానీ ఇంత దారుణంగా అని ఇదే ప్రత్యక్షంగా చూడటం. ఇది చూసి సృష్టి కర్త ఆశ్చర్యపోయి ఇలా అంటున్నాడు.

**శా. దంశవ్రాతములుం బిపీలికలు మేదః క్రవ్య రక్తంబులన్**

**సంకీర్ణంబులు జేసి పట్టితినఁగా శల్యావశిష్టుండ వై**

**వంశచ్ఛన్నతృణావళీయుత మహావల్మీకమం దింద్రియ**

**భ్రంశం బింతయు లేక నీకు నిలువం బ్రాణంబు లెట్లుండెనో? [౭-౮౨]**

రోజుకోసారి భోజనం చేసేవాళ్ళని యోగులనీ, రెండుసార్లు చేసేవాళ్ళు భోగులనీ, మూడు సార్లు అంతకన్నా ఎక్కువసార్లు కానీచేసేవాళ్ళు రోగులనీ సరదాగా అంటూ ఉంటారు. ఇక్కడ హిరణ్యకశిపుడికి భోజనం గాలి మాత్రమే. బ్రహ్మ అంటున్నాడు "ఈగలూ, చీమలు నీలో ఉండే కొవ్వూ, మాంసం అన్నీ తినేసినా అసలు ఇంద్రియాలు చెదరకుండా ఉండటం ఎలా కుదురుతుంది? నీ ప్రాణాలెలా నిలబడి ఉన్నాయి?"

**ఉ. ఉత్సుకతన్ జలాన్నముల నొల్లక యీ క్రియ నూఱుదివ్య సం**

**వత్సరముల్ శరీరమున వాయువులన్ నిలుపంగ వచ్చునే**

**యుత్సవమయ్యెఁ జూచి మము నుగ్రతపంబున గెల్చి తీవు నే**

**వత్సలతన్ నినుం గదియ వచ్చితిఁ గోరిక లెల్ల నిచ్చెదన్.** [౭-౮౩]

ఇలా తిండీ తిప్పలూ లేకుండా అసలు ఇన్నిసంవత్సరాలు బతికి ఉండడం సాధ్యమేనా? నీ పట్టుదల చూసి చాలా సంతోషం అయ్యింది. ఇంక లే, నువ్వేమి కోరితే అదే ఇస్తాను. మొట్టమొదట హిరణ్యకశిపుడి దగ్గిర్నుంచి నేర్చుకోవల్సింది వాడి పట్టుదల. శరీరం ధ్వంశం అయిపోయినా సరే తను అనుకున్నది సాధించి తీరుతాడు. అంత పట్టుదలా, పరాక్రమం ఉన్నాడు కనకే అద్భుత చరితుడయ్యేడు.

వ. అని పలికి వనమక్షికాపిపీలికాభక్షితం బైన రక్షోవిభుని దేహంబుమీఁదంగ మండలు జలంబులు ప్రోక్షించిన న ద్దానవేంద్రుండు గమలాసనకరకమల కమనీయ కనకమయదివ్యామోఘ కమండలు నిర్గత నిర్మల నీరధారా బిందుసందోహ సంసిక్త సకలాంగుం డయి తపంబు చాలించి సాంద్రకీచకసంఘాత సంఛాదిత వామలూరుమధ్యంబువెలువడి మహా ప్రభావ బలసౌందర్యతారుణ్య సహితుండును, వజ్రసంకాశ దేహుండును, దప్తసువర్ణుండును నై నీరసేంధననికర నిర్గతవహ్నియునుంబోలె వెలుంగుచుం జనుదెంచి.

[7-84]

ఇప్పుడు బ్రహ్మ అతడి మీద కమండలోంచి తీసిన నీరు జల్లేడు. వెంఠనే "దానవేంద్రుండు మహా ప్రభావ బలసౌందర్యతారుణ్య సహితుండును, వజ్రసంకాశ దేహుండును, దప్తసువర్ణుండు" అయ్యి బయటకొచ్చేడు.

గంగ విష్ణుపాదాల దగ్గిర మొదలై, బ్రహ్మ కమండలంలోంచి, శివుడి జటాజూటంలోంచి నేల మీదకి దిగింది అని కధ. ఇప్పుడు హిరణ్యకశిపుడిలో బల సత్వాలు పునురుద్ధరించడానికి ఇదే గంగాజలం వాడేడు బ్రహ్మ. కానీ ఈ జలం వల్లే నాకు ఇలా కోరిక సిద్ధించిందీ, అందువల్ల మళ్ళీ తపస్సు చేద్దాం అనుకోవట్లేదు. అదే రాక్షసత్వం అంటే. ఇదీ ముఖ్యంగా భాగవతోత్తముడైన అంబరీషుడికీ రాక్షసుడైన హిరణ్యకశిపుడికీ తేడా. మనలో గుణాలని బట్టి కోరికలు ఈడేరాక కోరికల్ని ఇచ్చిన దేముడ్నే మర్చిపోతూ ఉంటాం అని చెప్తూ ఉంటారు. భస్మాసురుడిందుకో పెద్ద ఉదాహరణ.

ఇప్పుడు కోరికలు అడిగే సమయం వచ్చింది. వచ్చే వ్యాసంలో హిరణ్యకశిపుడు శ్రీహరి గురించి అన్నీ జాగ్రత్తగా ఆలోచించి, విశ్లేషించుకుని అడిగిన కోరికా, బ్రహ్మ దేవుడి సమాధానం చూద్దాం.

పోతన భాగవతం ఇంటర్నెట్లో ఇక్కడ చూడవచ్చు: http://telugubhagavatam.org/

(కొనసాగింపు వచ్చే సంచికలో)

COMMENTS